సాక్షి అనకాపల్లి

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



రక్తదాన శిబిరాలు 10లో

పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవసరమైన ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామని, యువత ముందుకు రావాలని ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు.



కన్నీటి వీడ్కోలు 10లో

బెంగళూరులో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన హవల్దారు చిరంజీవికి స్వస్థలం కొత్తూరులో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి.



మృత్యువులోనూ.. 10లో

రేవుపోలవరం తీరంలో గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి. మృతులిద్దరూ మంచి మిత్రులన్న సంగతి తెలిసిందే.

న్యూస్‌రీల్

నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు



నార్కోటిక్ డాగ్ సాయంతో ఆటోలో తనిఖీలు చేస్తున్న సీఐ రేవతమ్మ, సిబ్బంది

నర్సీపట్నం: డౌనూరు చెక్‌పోస్ట్ వద్ద నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్‌తో బస్సు లు, ఆటోలు ఇతర వాహనాలను తనిఖీ చేశా రు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజా యి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టామన్నారు.

విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ

మాకవరపాలెం: విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ ఇచ్చారు. తామరం రైతుసేవా కేంద్రంలో సోమవారం మాకవరపాలెం, కోటవురట్ల, నక్కపల్లి మండలాల్లో విత్తనోత్పత్తి పథకంలో భాగంగా ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇచ్చారు. అనకాపల్లి విత్తనోత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఆత్మ పీడీ ఆశాదేవి విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించారు. విత్తనాల నాణ్యత, పరిమితులు, కేళీల గుర్తింపు, అంకురోత్పత్తి శాతం, వ్యవసాయ పద్ధతులు, తదితర అంశాలపై ఆత్మ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ శ్రీధర్, ఏపీ సీడ్స్ మేనేజర్ సాయిబాబు, స్థానిక ఏవో చిరంజీవి పాల్గొన్నారు.

ప్రజలపై రూ.6,072 కోట్ల విద్యుత్ భారం



నాలుగు రోడ్ల కూడలిలో నిరసన చేస్తున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల: ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పీపీసీఏ) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రూ.6,072 కోట్ల విద్యుత్తు చార్జీల భారం మోపడం దారుణమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు విమర్శించారు. సోమవారం అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలి వద్ద సీపీఐ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. విద్యుత్ చార్జీల పెంపునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రజలపై ఎలాంటి విద్యుత్తు భారం మోపబోమని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 2022 -23 సంవత్సరానికి సంబంధించి వాడిన విద్యుత్‌పై ఇప్పుడు చార్జీలు చెల్లించాలని భారం వేయడం తగదన్నారు. విద్యుత్ భారం మోపి దీపావళికి ఉచిత గ్యాస్ ఇస్తామంటే ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.

'ఇసుక సరఫరాను ప్రైవేటుకు అప్పగించడం దారుణం'

దేవరాపల్లి: ఇసుక తవ్వకాలు, స్టాక్ పాయింట్ల నిర్వహణ తదితర కీలక బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న ధ్వజమెత్తారు. దేవరాపల్లిలో సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉచిత ఇసుక పాలసీని సవరించి, ప్రైవేటుకు కట్టబెట్టేందుకు జీవో విడుదల చేసినట్టు స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. కలెక్టర్ హెచ్చరికలు జారీ చేసినా బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారన్నారు. ఇసుక దందాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రధాన పాత్రధారులన్న విషయం బహిరంగ రహస్యమేనన్నారు. నదులు, వాగులు, బ్రిడ్జిల సమీపంలో ఉచితం పేరిట ట్రాక్టర్లతో ఇసుక తీసుకెళ్లే పద్ధతిని నిలుపుదల చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

అవిగో... శుభ ఘడియలు

- ముగిసిన మూఢం
- వివాహ ముహూర్తాలు మొదలు
- డిసెంబర్ నెలాఖరు వరకు పెళ్లిళ్ల సీజన్
- కల్యాణ మండపాలు, పురోహితులకు డిమాండ్





ముహూర్తాలు ఇలా..

అక్టోబర్ 13,16,20,27

నవంబర్ 3,7,8,9,10,12,13,14,16,17,18, 22,23,25,26,28,29

డిసెంబర్ 4,5,6,7,8,9,11,12,14,15,16,26

యలమంచిలి రూరల్ : మూఢం ముగిసింది.. వివాహాది శుభకార్యాలకు అడ్డంకి తొలగిపోయింది. శుభ ఘడియలు సమీపించడంతో పెళ్లిళ్లకు ముహూర్తాల సందడి మొదలైంది. మూడు నెలల పాటు కొనసాగిన మూఢాలు ముగిసి, ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసాల్లో (అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు) మంచి లగ్నాలు ఉండడంతో వివాహాది శుభకార్యాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 13న ప్రారంభమైన మంచి ముహూర్తాలు డిసెంబర్ 30 వరకు ఉన్నట్టు వేద పండితులు చెబుతున్నారు. శుభ గడియలు రావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో పెళ్లిళ్లు, అనుబంధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. తర్వాత సంక్రాంతి పండుగ నెల కావడంతో మళ్లీ వచ్చే ఫిబ్రవరి వరకు ముహూర్తాల కోసం ఆగాల్సిందే. అందుకే ఈ ఏడాది దీపావళి తర్వాత పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ఉపనయనాలు, గృహప్రవేశాలు కూడా ఎక్కువగా జరుగుతాయని పండితులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. అలాగే ఈవెంట్ మేనేజర్లు, కేటరింగ్, లైటింగ్, షామియానా, అలంకరణ కార్మికులకు ముందస్తు బుకింగ్‌లు జరిగాయి. మతాంతర వివాహాలు చేసుకునేవారు, అలాగే భారతీయ సంప్రదాయాలను గౌరవించే ఇతర మతస్థులు సైతం అదే ముహూర్తాల్లో తమ మతాచారాల ప్రకారం చర్చిలు, మసీదుల్లో వివాహాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపాలతో పాటు షాదీఖానాలు, చర్చిల ఆధ్వర్యంలోని మ్యారేజి హాళ్ల బుకింగ్‌లు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మూడు నెలల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు వేలకు పైగా వివాహాలు జరగనున్నట్టు అంచనా.

మారిన ట్రెండ్

గతంలో వివాహాలంటే బ్యాండు మేళాలు, భాజాభజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి సాధారణంగా ఉండేవి. ఇప్పుడు ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్ల కోసం ఇతర లొకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు వెళ్తున్నారు. సినిమాటిక్‌గా వధూవరులతో స్పెషల్ సాంగ్స్ రూపకల్పన చేసి వాటిని ముందుగానే సోషల్ మీడియాలో విడుదల చేయడం, కల్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై ప్రదర్శించడం.. ఇలా విభిన్నంగా వేడుకను చేసుకునేందుకు ఈతరం వధూవరులు, వారి కుటుంబీకులు ఆసక్తి చూపుతున్నారు.

షాపింగ్ సందడి: విశాఖనగరం, గాజువాక, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం సహా మండల కేంద్రాల్లో వస్త్ర, బంగారు దుకాణాలన్నీ కొద్ది రోజులుగా కిటకిటలాడుతున్నాయి. బంగారు ఆభరణాల కోసం ఆర్డర్లు బాగానే వస్తున్నాయని యలమంచిలికి చెందిన ఓ బంగారు వ్యాపారి చెప్పారు. దీనికితోడు దీపావళి పర్వదినం నేపథ్యంలో విక్రయాలు జోరందుకున్నాయి.

ఫంక్షన్ హాళ్లకు డిమాండ్: వివాహ ముహూర్తాల నేపథ్యంలో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ బాగా పెరిగింది. ముందస్తుగా బుకింగ్స్ జరిగాయి. వీటి అద్దెలు భారీగా పెరిగాయి.

వివాహాలకు అనుకూలం



నవంబర్, సెంబర్ నెలల్లో చాలా మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలు శూన్యమాసం, భాద్రపద మాసం కావడంతో వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. డిసెంబర్ నెలాఖరు వరకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. మంచి రోజుల్లో శుభకార్యాలు చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

–పెద్దింటి సూర్యనారాయణమూర్తి, జిల్లా పురోహితుల సంఘం అధ్యక్షుడు

అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం



డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా తదితరులు

- ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి
- చర్చించిన ప్రతి అంశానికీ స్పందించాలి
- డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

సాక్షి, అనకాపల్లి: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధిలో ప్రతి అధికారి భాగస్వామి కావాలని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, తాగునీటి వసతి మొదలైన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం (డీఆర్సీ) జరిగింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సి.ఎం.రమేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ విజయ కృష్ణన్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ.. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కింద జిల్లాలో 3 లక్షల 700 మంది లబ్ధి పొందనున్నారని తెలిపారు. రూ.4,500 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ అనుసంధానంతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సమీక్ష సమావేశంలో పరవాడ ఫార్మా సిటీ నుంచి తాడి నిర్వాసిత గ్రామాన్ని తరలించాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ ఆడిట్ జరపాలని ప్రజాప్రతినిధులు కోరారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి, పరవాడ నుంచి అసకపల్లి, అగనంపూడి నుంచి అచ్యుతాపురం రోడ్లు మరమ్మతులు చేపట్టాలని, నాలుగు లేన్ల రోడ్లుగా మార్చి జాతీయ రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా పారిశ్రామిక కనెక్టివిటీ పెరుగుతుందని చర్చించారు.

నియోజకవర్గానికి ఒక ఇండోర్ స్టేడియం

స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మాకవరపాలెం మండలం రాచపల్లి వద్ద గల అన్‌రాక్ అల్యూమినియం ఫ్యాక్టరీ ఒప్పందాలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించే ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలని చెప్పారు. ఫ్యాక్టరీ వాహనాల వలన రోడ్లు పాడవుతున్నాయని, వాటి రాకపోకలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్రం అందించే నిధులతో నియోజకవర్గానికి ఒక ఇండోర్ స్టేడియం నిర్మించాలని కోరారు. విద్యార్థులు స్కూల్ బ్యాగుల్లో కూడా గంజాయి తీసుకెళుతున్నారని.. వారి కదలికలపై నిఘా పెంచాలని అధికారులకు ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో గల గ్రామ పంచాయతీ సెక్రటరీ, విలేజ్ రెవెన్యూ అధికారుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. పాయకరావుపేట పట్టణానికి మంచినీటి సరఫరా నిమిత్తం రూ.180 కోట్లతో చేపట్టిన మంచినీటి పథకం జాతీయ రహదారుల శాఖ వారి అభ్యంతరాలతో నిలిచిపోయిందని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో దయానిధి, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సేఫ్టీ ఆడిట్

కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ.. రోడ్లు మరమ్మతులకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, పనులు చేపడతామని తెలిపారు. గోవాడ చక్కెర కర్మాగారంలో ఇథనాల్ ఉత్పత్తికి డీపీఆర్ తయారు చేసినట్లు తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు సేఫ్టీ ఆడిట్ టీం ఏర్పాటు చేసి రోజుకు మూడు కంపెనీలలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ గంజాయి రవాణా నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నామని, రెండు స్క్వాడ్లు అదనంగా కావాలని కోరారు.

ప్రాజెక్టుల పూర్తికి కృషి

తుమ్మపాల: రైల్వే జోన్, సుజల స్రవంతి, పోలవరం వంటి ప్రతిష్టాత్మక పథకాలను కూటమి ప్రభుత్వ హయాంలో ఈ ఐదేళ్లలో పూర్తి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పెంటకోట కన్వెన్షన్ హాల్లో సోమవారం జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశయాలతో పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తామంతా సమష్టిగా పనిచేస్తామన్నారు. ఎంపీ రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల, విజయ్‌కుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవి, కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కశింకోట హెచ్‌సీ మధుబాబు ఎంపిక

కశింకోట: జాతీయ స్థాయి మాస్టర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు కశింకోట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.మధుబాబు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆయన బంగారు, వెండి పతకాలు సాధించారు.

దీంతో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. ముందుగా రాష్ట్ర స్థాయిలో గుంటూరులో ఇటీవల నిర్వహించిన మాస్టర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభను కనబరిచి చెరో రెండు బంగారు, వెండి పతకాలను సాధించారు. మధుబాబును ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం కశింకోట వచ్చిన సందర్భంగా అభినందించారు.



మధుబాబును అభినందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

గబ్బాడలో టీడీపీ నేతలే ఇసుక దొంగలు

- ఇసుక దోపిడీపై విచారణ చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- దోపిడీదారులకు నర్సీపట్నం సీఐ తొత్తుగా వ్యవహరిస్తున్నారు
- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఫిర్యాదు



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

తుమ్మపాల: నర్సీపట్నం మండలం గబ్బాడ స్టాక్‌పాయింట్‌లో ఇసుక దోపిడీ చేస్తూ అడ్డంగా దొరికిపోయిన ఇసుక లారీలను సీజ్ చేసి, దోపిడీదారులపై చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిసి ఇసుక దోపిడీ గురించి వివరించారు. గబ్బాడ స్టాక్‌పాయింట్‌లో ఈ నెల 25న రాత్రి 7.30 గంటల సమయంలో ఇసుక దోపిడీపై సమాచారం మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు స్టాక్ పాయింట్ వద్దకు చేరుకున్నారని, ఆ సమయంలో ఒక పొక్లెయిన్ ద్వారా రెండు లారీల్లో ఇసుక లోడ్ చేస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మీడియా సోదరులు వీడియోలు చిత్రీకరించడంతో, దాన్ని గమనించి అక్కడున్న టీడీపీ నాయకులు జారుకున్నారని పేర్కొన్నారు. స్టాక్‌పాయింట్ వద్ద ఉన్న సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది కూడా వెళ్లిపోయారని తెలిపారు. అక్కడ 40 టన్నుల లోడ్ కెపాసిటీ కలిగిన రెండు లారీల్లో (ఏపీ39యూఎన్8789, ఏపీ39వీడీ8389) ఇసుక లోడ్ చేస్తున్నారని, తక్షణమే స్థానిక ఎమ్మార్వో, పోలీస్‌లకు సమాచారం అందించామన్నారు. నర్సీపట్నం రూరల్ ఎస్ఐ రావడంతో లారీలను స్వాధీనం చేసుకోవాలని కోరామన్నారు. రెండు రోజుల తర్వాత సీఐని కలిసి లారీల విషయమై ఆరా తీస్తే అక్కడ ఎటువంటి ఇసుక దోపిడీ జరగలేదని తహసీల్దార్ చెప్పడంతో లారీలను వదిలేసినట్లు, దోపిడీదారులకు సపోర్టుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తహసీల్దార్‌ను కలిస్తే ఇసుక లోడింగ్ విషయమై తమకు సమాచారం రావడంతో వెంటనే లోడింగ్ చేయవద్దని ఆదేశించామని, సిబ్బంది లోడింగ్ జరగకుండా నిలిపివేశారంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని వివరించారు. అనుమతులు లేని లారీలు స్టాక్ యార్డ్‌లోకి ఎందుకు వచ్చాయో చెప్పకుండా దోపిడీదారులకు అండగా అధికారులే నిలవడం దారుణమన్నారు. సీఐ, స్థానిక అధికారులుపై నమ్మకం లేకనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగిన ఇసుక దోపిడీకి సంబంధించి సీసీ పుటేజీలు బహిర్గతం చేయాలని, అనుమతులు లేకుండా వచ్చిన లారీలపై చర్యలు తీసుకుని ఇసుక దోపిడీని అరికట్టాలని కోరారు.

ఈఎస్ఐ ఆస్పత్రికి నేడు శ్రీకారం

- నేడు వర్చువల్ విధానంలో ప్రధాని శంకుస్థాపన
- అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు
- 60 వేల మంది కార్మికులకు ఉపయోగం



అచ్యుతాపురం సెజ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలం, (ఇన్‌సెట్) ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ నమూనా

అచ్యుతాపురం: ఎన్నో ఏళ్ల నుంచి వినిపిస్తున్న కార్మికుల డిమాండ్ కార్యరూపం దాల్చబోతోంది. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. వందలాది పరిశ్రమలున్న ఈ ఎస్ఈజెడ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి ప్రతిపాదన ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నప్పటికీ కాలయాపన జరుగుతూనే వస్తోంది. ఇటీవల సెజ్‌లో ప్రమాదాలు ఎక్కువైన నేపథ్యంలో ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాధాన్యత, ఆవశ్యకత మరింత పెరిగింది. ఆస్పత్రి నిర్మాణానికి ఏపీఐఐసీ రెండెకరాల స్థలాన్ని 33 ఎకరాల లీజుకు కేటాయించింది. 2022 జూలై 21న ఒప్పందం జరిగింది.

స్థల సమీకరణ పూర్తి

అచ్యుతాపురం సెజ్‌లో రెండు ఎకరాల్లో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి స్థల సమీకరణ పూర్తయింది. ఇటీవల ఈ స్థలాన్ని ఈఎస్ఐ విభాగానికి అప్పగించారు. త్వరలోనే నిధుల కేటాయింపు, పనుల ప్రారంభం జరగనుంది. ఈ ఆస్పత్రిలో 30 పడకల ఇన్‌పేషెంట్ విభాగం, సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ఆస్పత్రితో పాటు పదహారు నివాస గృహ సముదాయాల నిర్మాణ పనులను సీపీడబ్ల్యూడీకి అప్పగించారు. 18 నెలల కాల వ్యవధిలో రూ.62.21 కోట్లతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కార్మిక శాఖ అంచనా వేస్తుంది. ప్రత్యేక వైద్యుల్ని నియమించనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటి వరకూ మల్కాపురంలోనే ఈఎస్ఐ ఆస్పత్రి ఉంది. కార్మికుల అవసరాల రీత్యా అచ్యుతాపురంలో ఏర్పాటు చేసే ఆస్పత్రి గ్రామీణ జిల్లా ఉద్యోగులకు ఉపయోగపడనుంది. అచ్యుతాపురం సెజ్‌లో 5,550 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 106 పరిశ్రమలు ఉన్నాయి. సుమారు 60 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అంతే కాకుండా 25 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 600 కర్మాగారాలలో పని చేస్తున్న 37 వేల మంది బీమా పొందిన కార్మికులు, లక్షా నలభై వేల మంది లబ్ధిదారులు, వారి కుటుంబీకులు వైద్య సదుపాయాలు పొందనున్నారు. సెజ్‌లో ఏర్పాటు కానున్న ఈఎస్ఐ ఆస్పత్రి వేలాది మంది కార్మికులకు, రాష్ట్ర ఉద్యోగులకు ఉపయోగపడనుంది.

ఇదీ మా 'జల దృక్పథం'..

- మురికినీటిని శుద్ధి చేసి వాడుకునే విధానం రూపొందించిన చెట్టుపల్లి విద్యార్థులు
- 45 రోజులు శ్రమించి జాతీయస్థాయి పోటీలకు నమూనా రూపకల్పన
- నీటి కొరతకు, కాలుష్య సమస్యకు ఇదే పరిష్కారమంటున్న బాలలు



నమూనా గురించి ఎంఈవో నాగేంద్రకు, ఉపాధ్యాయులకు వివరిస్తున్న బృంద సభ్యులు



చెట్టుపల్లి విద్యార్థులు రూపొందించిన జల దృక్పథం నమూనాను వివరించే చిత్రాలు

నర్సీపట్నం: రోజురోజుకు జనాభా పెరుగుతోంది.. నీటి వనరులు తగ్గుతున్నాయి.. మరి పరిష్కారమేమిటి? నీటి కాలుష్యం నుంచి బయటపడేదెలా? ఈ ప్రశ్నలకు సమాధానంగా 'జల దృక్పథం' అనే నమూనా రూపొందించారు చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. చెన్నై సీపీఆర్ పర్యావరణ విద్యా కేంద్రం, విప్రో సంస్థ సంయుక్తంగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనకు అనకాపల్లి జిల్లా నుంచి ఈ పాఠశాల ఎంపికైంది. గతంలో ఈ స్కూలు విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకొని జిల్లా విద్యాశాఖ ఈ పాఠశాలను నామినేట్ చేసింది. ఉపాధ్యాయుడు రాజగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థుల బృందం 'జల దృక్పథం' పేరిట నమూనా రూపొందించింది. తొమ్మిదో తరగతి చదువుతున్న వెలంకాయల సాయిశివాని, పండూరి మనోజ్‌కుమార్, మోక్ష మాధురి కౌశిక్ ఈ బృందంలోని సభ్యులు. తక్కువ ఖర్చుతో మురుగునీటిని పరిశుద్ధం చేసే నమూనాను వీరు రూపొందించారు.

అర్బన్ ప్రాంతాలకు ఎంతో ఉపయోగం

'జల దృక్పథం' ప్రాజెక్టు జనావాసాలు ఎక్కువగా ఉండే పట్టణ, నగర ప్రాంతాలకు ఎక్కువ ఉపయోగం. 10 వేల లీటర్ల నీటిని వినియోగించే అపార్ట్‌మెంట్లు తదితర ప్రదేశాల్లో రూ.85 వేల వ్యయంతో దీనిని రూపొందించుకోవచ్చని, దీని ద్వారా మురికినీటి నుంచి మంచినీటిని తిరిగి పొందవచ్చని నమూనా రూపొందించిన విద్యార్థులు వివరిస్తున్నారు. రసాయనాలు వినియోగించకుండా జీవ చికిత్స పద్ధతుల ద్వారా నీటిని శుద్ధి చేయవచ్చంటున్నారు. సాధారణంగా మురికినీటిలో టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్ (టీడీఎస్) విలువలు 1200 పైబడి ఉంటాయి. నీటి జాతి మొక్కల ద్వారా ఈ నీటిని శుద్ధి చేస్తే టీడీఎస్ 800 వరకు తగ్గుతుంది. అప్పుడు తాగునీటికి మినహా మిగతా అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వాడుకోవచ్చని ఈ ప్రాజెక్టుకు మార్గదర్శకుడిగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడు ఎ.వి.రాజగోపాల్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం నాలుగు బ్లాకులను తీసుకున్నారు. మొదటి బ్లాకులో వేసిన మురికినీరు 2, 3 బ్లాకులలోని నీటి జాతి మొక్కల వల్ల పరిశుద్ధమై నాల్గవ బ్లాకులోకి వస్తుంది. విద్యార్థులకు నీటి పట్ల అవగాహన పెంచడానికి పాఠశాలలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ప్రహరీ గోడలపై నీటి ఆవశ్యకతను తెలియజేసే తైలవర్ణ చిత్రాలను వేశారు. విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించి, ఆ విషయాలతో కూడిన ప్రదర్శనను సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. నమూనా ఉపయోగంపై తల్లిదండ్రులు, ఇతర విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శనను ఎంఈవో జి.వి.ఎస్.నాగేంద్ర తిలకించారు. ఈ ప్రదర్శనలో హెచ్ఎం రామకృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు దోహదం



చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నర్సీపట్నం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయని ఆర్డీవో వి.వి.రమణ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని కళలపై పట్టు సాధించాలన్నారు. తనకు క్విజ్ పోటీలు అంటే చాలా ఇష్టమని, అదే పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా చేసిందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొదటి రోజు జరిగిన చిత్ర లేఖనం పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభకనబరిచారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అడిగర్ల వరహాలనాయుడు, జి.వి.రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వి.రమణ, ఎ.రమణమూర్తి, డి.వి.ఆర్.మూర్తి, వానపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగా అసోసియేషన్ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా సతీష్



రాష్ట్ర యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన పుల్లేటి సతీష్

చోడవరం: రాష్ట్ర యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రముఖ యోగా గురువు పుల్లేటి సతీష్ నియమితులయ్యారు. సుమారు 15 ఏళ్లుగా చోడవరంలో పతంజలి యోగా కేంద్రం ఏర్పాటు చేసి, ఈ ప్రాంత ప్రజలకు సతీష్ యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్న సతీష్‌ను తాజాగా రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్మీ జవానుకు కన్నీటి వీడ్కోలు

- బెంగళూరులో బ్రెయిన్ స్ట్రోక్‌తో హవల్దారు చిరంజీవి మృతి
- రాంబిల్లి మండలం కొత్తూరులో విషాదం
- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



చిరంజీవి మృతదేహం వద్ద గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు (ఇన్‌సెట్) హవల్దార్ చిరంజీవి(ఫైల్)

రాంబిల్లి (యలమంచిలి): కుటుంబానికి దూరంగా ఉంటూ.. ఉద్యోగమే పరమావధిగా దేశ రక్షణ శాఖలో హవల్దారుగా విశేష సేవలందిస్తున్న పప్పల చిరంజీవి బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతి చెందాడు. దాంతో కొత్తూరు గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. అందరిలో కలసిమెలసి సౌమ్యుడిగా ఉంటున్న అతడి మృతిని గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోయారు. కడచూపు కోసం పెద్దఎత్తున తరలివచ్చి అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు. సైనిక లాంఛనాలతో ఆర్మీ, పోలీసు అధికారులు ఘన నివాళులర్పించారు. రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన పప్పల చిరంజీవి(38) 2004 డిసెంబరు 8న ఆర్మీలో చేరాడు. ప్రస్తుతం బెంగళూరు ఆర్మీ యూనిట్‌లో పారామిలిటరీ కమాండోలో హవల్దారుగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 23న తీవ్ర అస్వస్థతకు గురై ఆర్మీ ఆస్పత్రిలో చేరగా, అక్కడ చికిత్స పొందుతూ 26న రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ గురై మృత్యువాత పడినట్లు సహచర ఆర్మీ అధికారులు తెలిపారు. అతడి మృతదేహాన్ని బెంగళూరు నుంచి స్వగ్రామం కొత్తూరుకు సైనికాధికారులు సోమవారం తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, అభిమానులు, మాజీ సైనికోద్యోగులు, ప్రజాప్రతినిధులు అంతమ యాత్ర రథంతో యలమంచిలి పట్టణం నుంచి కొత్తూరు గ్రామం వరకు దారిపొడవునా ద్విచక్ర వాహనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. గ్రామంలో కొద్దిసేపు చిరంజీవి మృతదేహాన్ని ఉంచగా, పలువురు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పులతో శ్మశానానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ చిరంజీవి మృతదేహంపై జాతీయ పతాకాన్ని ఉంచి ఆర్మీ సుబేదార్ మండల్, రాంబిల్లి సీఐ నర్సింగరావు ఆధ్వర్యంలో పోలీసులు, ఆర్మీ అధికారులు పరేడ్ నిర్వహించి సైనిక వందనం చేసి మౌనం పాటించారు.

గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి నివాళులర్పించారు. అనంతరం చిరంజీవి భార్య మాధురికి జాతీయ పతాకాన్ని అతడు ఆఖరిసారిగా వేసుకున్న యూనిఫాం అందజేశారు. కుమార్తె సమీరా, కుమారుడు దుర్గా ఫణిలోక్, తండ్రి ఈశ్వరరావు, తల్లి చిన్నమ్మలు చిరంజీవి మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- రేవుపోలవరం తీరంలో గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు లభ్యం





తీరంలో గల్లంతై ఒడ్డుకు కొట్టుకొచ్చిన అర్జున్, సంజయ్‌కుమార్ మృతదేహాలు

ఎస్.రాయవరం: వివాహ వేడుకకు వచ్చి.. సరదాగా స్నేహితులతో రేవుపోలవరం తీరంలో స్నానానికి దిగి గల్లంతైన ఇద్దరు విద్యార్థులు విగత జీవులుగా మారారు. పోలీసుల గాలింపు చర్యల్లో సోమవారం ఇక్కడ తీరంలో మృతదేహాలు లభ్యమయ్యాయి. సాధారణంగా సముద్రంలో గల్లంతై వేరువేరు దూరాలకు కొట్టుకుపోయి రోజులు గడిచాక మృతదేహాలు కనిపిస్తాయి. ఆదివారం సముద్రంలో మునిగి గల్లంతైన ఇరువురు విద్యార్థుల్లో తొలుత అర్జున్ మృతదేహం దొరికింది. అర్ధ గంట వ్యవధిలో సంజయ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. రాత్రి నుంచి ఇక్కడ తీరం ఒడ్డున ఉండిపోయిన కుటుంబ సభ్యులకు తమ కుమారులు విగతజీవులుగా మారి నీటిలో తేలియాడుతూ కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇరువురు మృత దేహాలను ఒడ్డుకు చేర్చేసరికి వారి దుఃఖాన్ని ఆపడం ఎవరితరమూ కాలేదు. అనంతరం పోలీసులు నక్కపల్లి సామాజిక ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అప్పటికే పొరుగు గ్రామాల నుంచి కొరుప్రోలు చేరుకున్న బంధుమిత్రులు, గ్రామస్తులు ఇరువురు మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సాయంత్రం ఒకే చోట అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం కళాశాలకు వెళ్లాల్సిన కుమారుల శవాలను శ్మశానానికి సాగనంపడంతో తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. గ్రామ పెద్దలు రాము, రాజు తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఎస్‌ఐ విభీషణరావు కేసు దర్యాప్తు చేశారు.

నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



నిందితుడు శ్రీనివాసరావు

మల్కాపురం(విశాఖ) : కెనడాలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురు నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన వ్యక్తిని మల్కాపురం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలం గుండుపాలెం గ్రామంలో వడిల్లిబోయిన శ్రీనివాసరావు నివాసముంటున్నాడు. మల్కాపురం ప్రాంతంలో అతని బంధువులుంటున్నారు. తరచూ ఇక్కడకు వస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఇంటి పక్కన నివాసముంటున్న అంగ శ్రీనుతో పరిచయమైంది. యోగక్షేమాలు తెలుసుకున్నాడు. ప్రస్తుతం ఖాళీగా ఉన్నానని, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని శ్రీను చెప్పాడు. దీంతో కెనడాలో ఓ సూపర్ మార్కెట్‌లో సేల్స్ బోయ్‌గా ఉద్యోగాలు ఉన్నాయని, తనకు తెలిసిన మార్గం ద్వారా అక్కడకు పంపిస్తానని శ్రీనివాసరావు నమ్మబలికాడు. అయితే రూ.లక్ష ఖర్చు అవుతుందన్నాడు. దీంతో అప్పు చేసిన రెండు నెలల క్రితం లక్షరూపాయలను అంగ శ్రీను ఇచ్చాడు. అలాగే శ్రీను స్నేహితులు తొమ్మిది మంది దాదాపు రూ.11 లక్షల వరకూ శ్రీనివాసరావు ఇచ్చారు. నెలలు గడుస్తున్నా శ్రీనివాసరావు నుంచి ఎటువంటి సమాచారం రాక పోవడం..ఫోన్ చేస్తే పొంతన లేని సమాధానం చెప్పడం ప్రారంభించాడు. గట్టిగా అడిగేసరికి ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాడు. దీంతో తామంతా మోసపోయామని భావించి బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు. అంగ శ్రీను ఫిర్యాదు మేర విచారణ చేపట్టిన సీఐ విద్యాసాగర్ నిరుద్యోగులను మోసగించిన శ్రీనివాసరావును సోమవారం నర్సీపట్నం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు

- యువత ముందుకు రావాలి
- ఎస్పీ తుహిన్ సిన్హా



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

కశింకోట: జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవసరమైన ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. కశింకోటలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న కల్యాణ మండపంలో పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల ప్రారంభోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయని, ప్రమాదాలు జరిగినప్పుడు అవసరమైన వారికి అందించడం కోసం విరివిగా శిబిరాలు నిర్వహించి రక్తదానం ద్వారా రక్తాన్ని సేకరించాల్సి ఉందన్నారు. దీనికోసం అనుకూలమైన ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని, రక్తం ఇవ్వడానికి యువత ముందుకు రావాలన్నారు. దాతలకు పోలీసు శాఖ తరఫున ప్రోత్సాహకం అందిస్తామన్నారు. సీఐ అల్లు స్వామి నాయుడు, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. డీఎస్పీ అప్పారావు శిబిరాన్ని సందర్శించారు. సీఐ, పోలీసు సిబ్బందితోపాటు మండల కేంద్రం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సాహంగా వచ్చిన యువత రక్తదానం చేశారు. శిబిరంలో సుమారు వంద మంది రక్తదానం చేయగా.. వారిని అభినందిస్తూ ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. విశాఖ నుంచి ఫస్టు బ్లడ్ బ్యాంకు తరఫున డాక్టర్ ఎస్.నగేష్, ఇన్‌చార్జి పి.శ్రీనివాస్, తదితర సిబ్బంది రక్తాన్ని సేకరించి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖలోని వెంకటరమణ ఆస్పత్రి వైద్యులు సౌజన్య, హరిప్రియ రోగులను పరీక్షించారు.

గుక్కెడు మంచినీళ్లివ్వండి మహాప్రభో!

- రోలుగుంటలో వేధిస్తున్న ఫ్లోరైడ్ సమస్య
- మూడు వీధులకు కొత్తగా బోర్ల ద్వారా నీటి సరఫరా
- ఫ్లోరైడ్ సమస్య తెలియక వినియోగిస్తున్న ప్రజలు
- జానకీ రాంపురం నుంచి శుద్ధి చేసిన నీరు సరఫరా చేయాలని వినతి



ఎరుకుల, ఎస్సీ కాలనీవాసులకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు

రోలుగుంట: గుక్కెడు మంచినీళ్లివ్వండి మహాప్రభో అంటూ మండల కేంద్రం రోలుగుంట ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. మంచినీళ్లు దొరక, ఫ్లోరైడ్ నీటిని తాగలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌కు జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీరమణమ్మ వినతి పత్రం అందజేశారు. రోలుగుంట గ్రామం ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతం. ఈ విషయాన్ని గతంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు అధికారులు పరిశీలించి ఫ్లోరైడ్ ప్రాంతంగా గుర్తించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీంపలో బోరు తీసి, ఫ్లోరైడ్‌గా గుర్తించి నిలిపేశారు. కొమరవోలు వెళ్లే మార్గంలోని బావి నుంచి సరఫరా చేసే నీటిని కూడా ఫ్లోరైడ్ సమస్య కారణంగా నిలిపేశారు. మండలంలోని ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలైన కె.నాయుడుపాలెం, నిండుగొండ, ఎన్.కొత్తూరు తదితర పంచాయతీ ప్రజలకు జానకీరాంపురం సమీపంలోని నది నుంచి శుద్ధి చేసిన తాగునీటిని పంపింగ్ సిస్టం ద్వారా అందిస్తున్నారు. ఆ నీటినే మండల కేంద్రం రోలుగుంటకు కూడా సరఫరా చేస్తున్నారు. అయితే యాతవీధి, ఎరుకుల వీధి, ఎస్సీ కాలనీలకు ఆ నీరు సరఫరా కావడం లేదు. ఈ కాలనీలకు కొత్తగా మూడు బోర్లు తవ్వి, వాటికి మినీ ట్యాంకులు అమర్చి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రజలు కూడా ఆ నీటిని తాగునీటిగా వినియోగిస్తున్నారని, ఫ్లోరైడ్ బారిన పడే ప్రమాదం ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల్లో అవగాహన కల్పించి వాడుకనీరుగా వినియోగించుకునేలా చేయాలని కోరారు. ఈ కాలనీలకు కూడా జానకీరాంపురం నుంచి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో వార్డు సభ్యుడు మడ్డు నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ గ్రామ యువజన విభాగం అధ్యక్షుడు మడ్డు శివ, తదితరులు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



గంజాయి తరలిస్తున్న నిందితులతో పోలీసులు

నర్సీపట్నం: ఏజెన్సీ నుంచి నర్సీపట్నం మీదుగా స్కూటీపై రెండు కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేశామని రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. గబ్బాడ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా.. అచ్యుతాపురం మండలం పెదపాడు గ్రామానికి చెందిన డి.లోకేష్(24), పరవాడ మండలం కట్టవానిపాలెం గ్రామానికి చెందిన వి.దుర్గారావు(24) స్కూటీపై వస్తూ గంజాయితో పట్టుబడ్డారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి స్కూటీ, సెల్‌ఫోన్, గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

మొక్కుబడి సమావేశాలెందుకు?

- సాగుదారుల హక్కు చట్టం-2024 ప్రాంతీయ సదస్సుపై రైతుల పెదవి విరుపు
- రైతులకు సమాచారం లేకుండా సదస్సా?
- ప్రభుత్వం, అధికారుల తీరును ఎండగట్టిన రైతులు



మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్

మహారాణిపేట(విశాఖ): కొత్త సాగుదారుల హక్కు చట్టం -2024 ప్రాంతీయ రైతు సదస్సులో రైతులు ఆవేశం వెళ్లగక్కారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కొత్తసాగుదారుల హక్కు చట్టం-2024 రూపకల్పనకు భూయజమానులు, కౌలు రైతులు, అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆరు జిల్లాల నుంచి రైతులు, అధికారులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ తీరును రైతులు ఎండగట్టారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన ఏ ఒక్క పథకం ఇంకా అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. పంటల పెట్టుబడి కోసం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారని, ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల భారీ వర్షాలకు పంటలకు భారీ నష్టం వచ్చిందని, అధికారులు కూడా వివరాలు సేకరించారని, ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామ సభలకు రైతులు రావడం లేదు

గ్రామ సభలకు రైతులు రావడం లేదని వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సభలకు కనీసం పది మంది కూడా హాజరుకావడం లేదన్నారు. ఉపాధి హామీ గ్రామ సభలు కూడా జరగడం లేదని చెప్పారు. 2011, 2019 చట్టాలను రద్దు చేయడంతో పాటు నూతన కౌలురైతు చట్టంపై చాలా మంది రైతుల్లో భయాందోళనలు నెలకున్నాయని, నివృత్తి చేసేందుకు ఈ సదస్సు నిర్వహించామన్నారు. నూతన చట్టంతో కౌలు రైతులకు మేలు చేకూరుతుందన్నారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఢిల్లీరావు తొలుత సీసీఆర్‌సి యాక్టు-2019లో లోపాలను, రానున్న న్యూ టెనెంట్ యాక్టు-2024పై చర్చించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ వి.శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఏడీఏ ఎం.గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

విచారణకు అనకాపల్లి డీపీవో డుమ్మా

- మళ్లీ బుధవారం విచారణ



జిల్లా పరిషత్ భవనం

మహారాణిపేట: పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీపై విచారణకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి డుమ్మా కొట్టారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తి విచారణ నిర్వహించారు. గత నెల 28,29న తేదీల్లో అడ్డగోలు బదిలీలపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లా పరిషత్ సీఈవోను ఆదేశించిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులుగా జెడ్పీ సీఈవో విచారణ చేస్తున్నారు. సోమవారం విచారణకు రావాలని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ అధికారులకు నోటీసులు ఇచ్చారు. అయితే విచారణకు కీలకమైన అనకాపల్లి డీపీవో హాజరు కాలేదు. విశాఖ డీపీవో, ఏఎస్సార్ నూతన డీపీవో విచారణకు హాజరయ్యారు. బుధవారం ముగ్గురు డీపీవోలు విచారణకు రావాలని విచారణ అధికారి ఆదేశించారు. ఈవోపీఆర్‌అండ్ ఆర్డీల జాబితా తయారు చేయాలని, ఇప్పటి వరకు ఏజెన్సీలో ఎవరు పనిచేయలేదో వివరాలు తెలియజేయాలని విచారణ అధికారి కోరినట్టు సమాచారం.

పెండింగ్ అర్జీలకు తక్షణ పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 246 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: పలు సమస్యలపై ప్రజలు అందిస్తున్న అర్జీలకు సంబంధించి తక్షణమే విచారణ చేపట్టి పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె వినతులు ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా అర్జీదారులతో అధికారులు మాట్లాడి పరిష్కారం చూపాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను తెలియజేయాలన్నారు. ప్రజల సమస్యలను గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. కలెక్టర్‌తో పాటు జేసీ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఎస్డీసీ సుబ్బలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 246 అర్జీలు నమోదవ్వగా.. రెవెన్యూ సమస్యలు 153, పోలీస్ 18, పంచాయతీరాజ్ 14, ఇతరాత్ర ఫిర్యాదులు అందాయి.

డ్వాక్రా రుణాల్లో చేతివాటంపై ఫిర్యాదు

డ్వాక్రా రుణాల మంజూరులో చేతివాటం ప్రదర్శిస్తున్న సీసీ(వీవోఏ)పై చర్యలు తీసుకోవాలని కోరుతూ చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రుణాల మంజూరులో సభ్యురాలి నుంచి కనీసం రూ.5 వేలు వసూలు చేస్తున్నట్టు చెప్పారు. సీసీని ప్రశ్నిస్తే తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి భయపెడుతోందని, తక్షణమే ఆమె అవినీతిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌పై ఫిర్యాదు

కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ యాజమాన్యం ఏడాది కాలంగా జీతాలు చెల్లించడం లేదంటూ స్కూల్‌లో పని చేసిన ఉపాధ్యాయులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

బుచ్చెయ్యపేట: గంటికొర్లాం పంచాయతీ నిధులు దుర్వినియోగంపై పాలకవర్గ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా పంచాయతీ బోర్డు సమావేశాలు నిర్వహించకుండా సాధారణ నిధులతో పాటు 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.11 లక్షల వరకు డ్రా చేసి దుర్వినియోగం చేశారన్నారు. సర్పంచ్ శరకాన గౌరమ్మకు తెలియకుండానే కుమారుడు బాబూరావు ఆమె వేలిముద్రలు వేసి నిధులు డ్రా చేసి దుర్వినియోగం చేశారని మాజీ సర్పంచ్, ప్రస్తుత ఉప సర్పంచ్ శనివాడ రాజారావు, వార్డు మెంబర్లు సుబ్బలక్ష్మి, మొండి సత్యనారాయణ, ఎన్.పరదేశమ్మ, ఎన్.ఉషారాణి, ఎస్.త్రినాథ్ కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు.

దేవరాపల్లిలో ప్రభుత్వ భూముల ఆక్రమణ

దేవరాపల్లి: మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కె.వి.రమణ, తదితరులు కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. దేవరాపల్లిలో ఇటీవల చెరువులు, రస్తాలతో పాటు గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పాత డంపింగ్ యార్డు స్థలాన్ని సర్వే నంబర్లు మార్చి విక్రయించారన్నారు. జనావాసాల మధ్య హెల్త్ సెంటర్‌కు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు దూరంగా తరలించాలని కోరారు. గ్రామ సమస్యలపై తహసీల్దార్ లక్ష్మీదేవికి కూడా ఫిర్యాదు చేశామన్నారు.

ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు



ప్రజా ఫిర్యాదులు వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: చట్టానికి లోబడి ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవరప్రసాద్, ఎల్.మోహనరావు నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసం తదితర అంశాలకు సంబంధించి 35 ఫిర్యాదులు అందాయి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మండుటెండలో విభిన్న ప్రతిభావంతుల నిరసన



కలెక్టరేట్ వద్ద మండుటెండలో నిరసన చేస్తున్న దివ్యాంగులు

తుమ్మపాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట మండుటెండలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా కేంద్రంలో తక్షణం దివ్యాంగుల కార్యాలయం ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. బధిర సంఘానికి స్థలం కేటాయింపు చేయాలని, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం డిసెంబర్ 3న బధిరులకు అవార్డ్స్ ప్రదానం చేయాలని కోరారు. ప్రతిభా పోటీలు నిర్వహించి దివ్యాంగులను ప్రోత్సహించాలన్నారు. ఆస్పత్రుల్లో బధిరులకు వైద్య పరీక్షలు చేసేందుకు అనుభవజ్ఞులైన వైద్యులను నియమించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సందర్శించి, దివ్యాంగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి ఆమె సానుకూలంగా స్పందించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కేరమ్స్ పోటీలకు ఎంపిక


యశ్వంత్

కశింకోట: రాష్ట్ర స్థాయి కేరమ్స్ పోటీలకు కశింకోట డీపీఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎంపికయ్యాడు. విశాఖలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రేమబత్తుల యశ్వంత్ 17 ఏళ్ల లోపు విభాగంలో ప్రతిభ చూపి, త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను హెచ్‌ఎం ఎం.ఆర్.వి.అప్పారావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆచంట రవి, పీడీ వి.ప్రభాకరరావు, విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

30న జాబ్ మేళా

అనకాపల్లి: మండలంలోని రేబాక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 30న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఎస్.గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా రెండు ప్రైవేట్ కంపెనీలతో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ విద్యార్హత కలిగి 18 నుంచి 40 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు ముందుగా naipunyam.ap.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని 30వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరు కావాలని చెప్పారు. వివరాలకు 81432 29228 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మాలధారులకు ఉచిత భిక్ష

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులకు ఉచిత అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం అయ్యప్ప ఆలయంలో మాలధారులకు ఉచితంగా అన్నదానం చేస్తామని తెలిపారు.

నేడు నాలుగు గ్రామాల్లో పంచాయతీ వారోత్సవాలు

కశింకోట: మండలంలోని నాలుగు గ్రామాల్లో మంగళవారం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఏనుగుతుని, 9.45 గంటలకు నూతలగుంటపాలెం, 10.15 గంటలకు జెట్టపురెడ్డితుని, 11 గంటలకు అడ్డాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 1,738 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,210	5,260
మొదటి రకం	3,660	4,600
రెండో రకం	3,420	4,100
మూడోరకం	3,350	3,450

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
వీణం 3డీ 2	:సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	:పర్తిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
నరుడి బతుకు నటన	:వెంకటేశ్వర
ఎంత పనిచేశావ్ చంటి	:శ్రీసత్య
పొట్టేల్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-27 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 412 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

జోరుగా పశుగణన


అనకాపల్లి మండలం పిసినికాడలో పశువుల లెక్కింపు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు


పశుగణన లెక్కింపు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

- ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో సర్వే
- గతేడాది వరకు నియోజకవర్గంలో 7.15 లక్షల పశువులున్నట్లు నిర్ధారణ
- 16 రకాల జాతుల గుర్తింపు
- పశువుల లెక్కింపు ఆధారంగా వ్యాధులకు మందులు


ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఐదేళ్లకు ఒకసారి జాతీయ స్థాయిలో నిర్వహించే పశుగణన కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది జోరుగా చేపడుతున్నారు. 21వ జాతీయ పశుగణన కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లి పశుగణన చేస్తున్నారు. వీరికి ఈ నెల 24న పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలో 52 మంది పశు సంవర్ధక సహాయకులు, ఆరుగురు సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఇంటింటికీ వెళ్లి పశువుల సంఖ్యను లెక్కిస్తున్నారు. ప్రభుత్వం ప్రధానంగా 16 రకాల జాతుల పశువులను గుర్తించేందుకు ఎన్యూమరేటర్ల ద్వారా గ్రామ, పట్టణంలో రైతుల పశువుల పాక వద్దకు వెళ్లి వివరాలను ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తోంది. వివిధ రకాలైన పశువుల పెంపకందారులు ప్రభుత్వ యాప్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల రైతుకు మేలు జరుగుతుంది.

జనాభా లెక్కల మాదిరిగానే..

దేశానికి స్వాతంత్ర్యం రాకముందే పశుగణన లెక్కింపు కార్యక్రమం మొదలైంది. జనాభా లెక్కల మాదిరిగానే పశువుల సంఖ్యను లెక్కిస్తారు. నేటి వరకు 20 సార్లు పశుగణన జరిగింది. మొదటి సారిగా 1919-1920లో లెక్కింపు నిర్వహించారు. ఈ ఏడాది 21వ జాతీయ పశుగణన కార్యక్రమం ద్వారా పశువుల వివరాలను సకాలంలో గుర్తించి, మేలు జరిగేందుకు చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లోని ప్రతి గృహానికి వెళ్లి పశువులు ఉన్నా.. లేకపోయినా వివరాలు తెలుసుకుని స్టిక్కర్లు అతికిస్తున్నారు. వీధి కుక్కలను మాత్రం పరిగణనలోకి తీసుకోరు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కలను లెక్కించి, పశు వైద్య సంవర్ధక శాఖ అధికారులు మాత్రమే నివేదిక అందజేస్తారు. వీటి ఆధారంగా ఏడాదిలో పశువులకు ఏయే వ్యాధులు సోకుతాయో గుర్తించి ప్రాంతాల వారీగా ప్రభుత్వం వ్యాధి నిరోధక మందులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతుంది.

ఈ పశువులను లెక్కించి, గుర్తిస్తారు..

పశుగణనలో ఆవులు, ఎద్దులు, దున్నలు, కుక్కలు, గాడిదలు, పందులు, కుందేళ్లు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గుర్రాలతోపాటు అనేక రకాలైన పశువులను ఎన్యూమరేటర్లు గుర్తిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తింపులో ఉన్న పశువులకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తారు. గతేడాది నియోజకవర్గంలో అన్ని రకాల పశువులు కలిపి 7,15,545 లెక్కింపులోకి వచ్చాయి. ఈ ఏడాది పశువుల శాతం పెరిగే అవకాశముందని, రైతులు పశువులకు బీమా చేయించడం వల్ల అవి మృత్యువాత పడిన వెంటనే పశు సంవర్ధక శాఖ అధికారులు పోస్ట్‌మార్టం ఆధారంగా ఇన్సూరెన్స్‌కు అవకాశం కల్పిస్తారు.

పశువులకు బీమా తప్పనిసరి



వివిధ రకాలైన పశువులను పెంచే వారు ప్రభుత్వ ఆదేశాల మేరకు బీమా పాలసీ చేయడం వల్ల అవి మృత్యువాత పడినట్లయితే లాభం చేకూరుతుంది. ఎన్యూమరేటర్లు, సిబ్బంది వచ్చినప్పుడు పశువుల పెంపకం దారులు తప్పనిసరిగా పూర్తి వివరాలు ప్రభుత్వ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. పశువులు వ్యాధుల బారిన పడినప్పుడు సకాలంలో ప్రభుత్వం నుంచి మందులు ఉచితంగా అందుతాయి. కొంతమంది పశుగణనకు ఇబ్బంది పడి వివరాలు చెప్పడం లేదు. దీంతో ప్రభుత్వం నుంచి పొందే సహాయం అందదు.

– బి.సౌజన్య, పశు సంవర్ధక శాఖ సహ సంచాలకులు, అనకాపల్లి

పశు బీమాతో ఎంతో మేలు



సుమారు 15 ఏళ్లగా వ్యవసాయంతోపాటు పాడిరైతులు చేస్తున్నాను. రెండు గేదెలు, ఒక ఆవు ఉన్నాయి. మనిషికి బీమా ఎలా అవసరమో.. పాడిపశువులకు అంతే అవసరం. ప్రకృతి వైపరీత్యాలు, అనివార్య కారణాల వల్ల పాడిపశువులు మృతిచెందినట్లయితే రైతుకు తీవ్ర నష్టం జరుగుతుంది. పశుగణనతోపాటు ఇన్సూరెన్స్ చేయించడం వల్ల ఎంతో మేలు చేకూరుతుంది.

– రాజగిరి అప్పలసత్యనారాయణ, కొత్తూరు, అనకాపల్లి మండలం

ఘనంగా గౌరమ్మ నిలుపు ఉత్సవం


గవరపేటలో గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కశింకోట: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి కశింకోట గవరపేటలో ఆది గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) నిలుపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని సంతబయలు ప్రాంతం నుంచి డప్పులు, వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా తీసుకొచ్చి గవరపేటలోని పెద్ద గుమ్మం వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నెలకొల్పారు. అనంతరం పూజలు చేశారు. దీపావళి మరుసటి రోజు నుంచి వచ్చే కార్తీక మాసం నెల రోజులు గౌరమ్మను పూజించి శారదా నదిలో సంప్రదాయ బద్ధంగా నిమజ్జనం చేస్తారు. నిలుపు ఉత్సవంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణిత శాస్త్రంపై లఘు నాటికలు


జ్యామితీయ పరికరాల ఉపయోగాలపై లఘు నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు


గణితంలో బోడ్మాస్ నియమాన్ని వివరిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న వెదురుపర్తి హైస్కూల్ విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జెడ్పీ హైస్కూల్‌లో భారతీయ గణిత శాస్త్రవేత్త శకుంతలదేవి జయంతి వారోత్సవాలు సోమవారం ఘనంగా మొదలయ్యాయి. హెచ్‌ఎం జి.వి.కె.ఆచారి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు ఎ.వి.ఎన్.మూర్తి, పి.వి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో గణిత శాస్త్ర విలువలను పెంపొందించేందుకు రోజుకొక కార్యక్రమం ద్వారా వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గణిత శాస్త్రంలోని జ్యామితీయ పెట్టెలో ఉన్న పరికరాల ఉపయోగాలు, బోడ్మాస్ నియమం, సమాన భిన్నాలు, స్థూపం, శంకు ఘన పరిమాణం వంటి గణిత భావనలను లఘు నాటికల ద్వారా విద్యార్థులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఇవి ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


గణిత భావనలపై అవగాహన కల్పిస్తున్న స్టూడెంట్లు

వన నర్సరీల్లో లక్ష మొక్కల పెంపకం


మొక్కల సంరక్షణ పనుల్లో ఉపాధి వేతనదారులు

కె.కోటపాడు: వన నర్సరీల్లో లక్ష మొక్కల పెంపకం చేపడుతున్నట్లు సోషల్ ఫారెస్ట్ అధికారులు తెలిపారు. మండలంలో సింగన్నదొరపాలెం, కొత్తూరు, రామచంద్రపురం వన నర్సరీల్లో లక్ష మొక్కలను పెంచుతున్నారు. తెల్లమద్ది, కానుగ, నేరేడు, పనస, బాదం, దేవకాంచర, టేకు, నెమలి, ఫెల్టోఫారం, వేప తదితర మొక్కలను పెంచుతున్నారు. వీటికి సకాలంలో నీటి తడులను అందించడంతో పాటు మొక్కల మధ్యలో కలుపు తీత పనులను ఉపాధి వేతనదారులు చేపడుతున్నారు. ఉపాధి నిధులు, ఎన్టీపీసీ, సేల్ ఆఫ్ సీలింగ్ నిధులతో వీటి పెంపకాన్ని చేపడుతున్నట్లు డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ తెలిపారు. రైతులు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్ల కిరువైపులా పెంచేందుకు అవసరమయ్యే మొక్కలు వన నర్సరీల్లో ఆరోగ్యంగా ఎదుగుతున్నట్లు పేర్కొన్నారు.

ఎల్లయ్య కాలువ బ్రిడ్జిపై రక్షణ గోడ నిర్మాణం


బ్రిడ్జిపై గోడ నిర్మిస్తున్న కాంట్రాక్టర్

అనకాపల్లి: స్థానిక వేల్పుల వీధి సర్వకదాంబ పార్కు ఎల్లయ్య కాలువ బ్రిడ్జి రక్షణ గోడకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు ఏడాది కిందట ఎల్లయ్య కాలువ పూడికతీత పనుల్లో బ్రిడ్జి రక్షణ గోడను కాంట్రాక్టర్, సిబ్బంది తొలగించారు. ప్రమాదాలు జరుగుతున్నాయని జోనల్ సిబ్బందికి తెలియజేయడంతో స్పందించిన కాంట్రాక్టర్ సోమవారం రక్షణ గోడను పునర్నిర్మించారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు, బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన


జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

తుమ్మపాల: జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద జీవీఎంసీ మున్సిపల్ కార్మికుల ఎంప్లాయీస్ ఫెడరేషన్-సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఇన్‌చార్జి జోనల్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. జీవీఎంసీ ఏడో జోన్ ప్రజా ఆరోగ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు సౌకర్యాలు సమయానికి అందడం లేదని, సరెండర్ లీవ్, ప్రమోషన్ స్కేల్ ఇంక్రిమెంట్లు, కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వలేదన్నారు. నాణ్యమైన పనిముట్లు లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడం వల్ల కార్మికులపై పనిభారం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. డీసీ ఏరియాల్స్, ఎర్న్ లీవ్స్ ఇవ్వాలన్నారు. క్లాప్ వాహన డ్రైవర్లకు, ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి ఖాళీలు భర్తీ చేయాలని సూచించారు. నిలిపివేసిన మలేరియా కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎర్రంశెట్టి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల అజయ్, పర్మినెంట్ కార్మిక యూనియన్ కార్యదర్శి ఎర్రంశెట్టి ఓంశివ, గూడుప పోలరావు, గోవిందు, నాగరాజు, ఎస్.నూకరాజు, శేఖర్, బొమ్మల రాము సత్యనారాయణ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యం ముఖ్యం

చమ్మచింత పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో వరహాలబాబు


విద్యార్థుల నోట్ పుస్తకాలు తనిఖీ చేస్తున్న ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు


మధ్యాహ్న భోజనం వంటకాల నాణ్యత పరిశీలిస్తున్న ఎంఈవో

నాతవరం: విద్యతో పాటు విద్యార్థులకు ఆరోగ్యం చాలా ముఖ్యమని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. చమ్మచింత ఎలిమెంటరీ పాఠశాలను సోమవారం ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇంతవరకు బోధించిన పాఠాలకు సంబంధించి పలు ప్రశ్నలు వేశారు. కొంతమంది విద్యార్థులతో లెక్కలు చేయించారు. ఇంగ్లిష్ పాఠ్య పుస్తకాలను చదివించి నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. వారి ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే నిర్వాహకులపై చర్యలు ఉంటాయన్నారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, విద్యార్థులకు వేడినీళ్లు అందించాలన్నారు.

8 నుంచి ప్రజా సమస్యలపై పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి లోకనాథం

నర్సీపట్నం: ప్రజా సమస్యలపై వచ్చే నెల 8 నుంచి 15వ తేదీ వరకు పోరాటాలు సాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ విద్యుత్‌తోపాటు చమురు చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపారన్నారు. వంట నూనెలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వాపోయారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్డున పడ్డారని, కార్మికులకు కనీస వేతనాలు అమలు కావటం లేదన్నారు. ఉద్యోగ భద్రత లేదన్నారు. పాల రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వటం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. జిల్లా కమిటీ సభ్యులు రుత్తల శంకరరావు, అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు త్రిమూర్తుల రెడ్డి, ఈరెల్లి చిరంజీవి, కె.వి.సూర్యప్రభ, ఆర్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి

పరవాడ: అనుమతుల్లేని బాణసంచా విక్రయాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు హెచ్చరించారు. సోమ వారం మీడియాతో మాట్లాడుతూ అక్రమ బాణసంచా అమ్మకాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీసుల అనుమతులు పొంది బాణసంచా సామగ్రిని విక్రయించుకోవచ్చన్నారు. అన్ని రకాల భద్రతా చర్యలు పాటించాలన్నారు.

పరిష్కార వేదికలో ఆక్రమణలపై ఫిర్యాదు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 15 అర్జీలు వచ్చినట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు. అమరావతి స్కూల్ యాజమాన్యం టీసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని నర్సీపట్నానికి చెందిన పి.విజయదేవి ఫిర్యాదు చేశారు. చోడవరం మార్గంలో వాటర్ ట్యాంక్ వద్ద ఆక్రమణలపై అల్లూరి చారిటబుల్ ట్రస్ట్ వారు ఫిర్యాదు చేశారు. కుటుంబానికి జీవనాధారమైన భర్త చనిపోయాడని, తనకు ఇద్దరు పిల్లలు, అనారోగ్యంతో ఉన్న మామతో ఇబ్బంది పడుతున్నానని, తనకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని ఎ.దేవి అర్జీ పెట్టుకుంది. భూ సమస్యలు, ఆక్రమణలు తదితర సమస్యలపై ఫిర్యాదు వచ్చాయి. వీటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీవో సూచించారు.

హిందూ మహాసభకు తరలి రండి

విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ పిలుపు


మాట్లాడుతున్న బంకుపల్లి సత్యనారాయణ

మాడుగుల రూరల్: హిందువులు ఐక్యతను చాటి చెప్పేందుకు, హిందుత్వానికి మద్దతుగా జనవరి 5న గన్నవరంలో నిర్వహించే హిందూ మహా సమ్మేళనానికి ప్రతి హిందువు తరలి రావాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మండల వీహెచ్‌పీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సమ్మేళానికి ఐదు లక్షల మంది హిందూ కుటుంబ సభ్యులు హాజరవుతారన్నారు. వచ్చే నెల 9 నుంచి 15వ తేదీ వరకు గోపాష్టమి పూజలు మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షులు రాపేట రామకొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి పెచ్చెట్టి కొండలరావు, మండల ధర్మ ప్రచారక్ చిరంజీవినాయుడు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'నూకాంబిక' హుండీ ఆదాయం రూ.52.88 లక్షలు


అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అనకాపల్లి: అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం గత నాలుగు నెలల్లో రూ.52.88 లక్షలు వచ్చింది. ఆలయ ప్రాంగణంలో సోమవారం అధికారుల సమక్షంలో హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. బంగారం 57.40 మిల్లీ గ్రాములు, వెండి 2 కిలోల 200 గ్రాములు వచ్చింది. ఈ ఏడాది జూన్ 27 నుంచి ఈ నెల 28 వరకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎం.సుజాత, జిల్లా ఏసీ సుధారాణి పర్యవేక్షించారు. లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, పూజారులు, శ్రీహరి సేన సభ్యులు, యూనియన్ బ్యాంకు సిబ్బంది, పట్టణ పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.